## 61. మోక్షం వేగం ఎంత?

ఓ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మవిద్య మీద పాఠం చెప్తూ మోక్షం అనేది తృటిలో ఒకేసారి వస్తుందని చెప్పాడు.

"అదెలా సాధ్యం? ఈ సృష్టిలో అన్నీ మెల్లిమెల్లిగా వస్తాయి కదా? పువ్వు తృటిలో విచ్చుకోదు. ధాన్యం తృటిలో పండదు. బిడ్డ తృటిలో పుట్టడు కదా?" ప్రశ్నించాడో శ్రోత.

ఆ ప్రశ్నకి ఆ ఆధ్యాత్మికవేత్త సమాధానం ఇవ్వలేదు. కొద్దిసేపయ్యాక ఆయన అకస్మాత్తుగా లేచి బల్లమీద నిలబడి గట్టిగా అరిచాడు.

"పాము. పాము."

శ్రోతలంతా భయంతో లేచి తలోవైపు పరిగెత్తారు. వెంటనే గురువు ఇలా చెప్పాడు.

"ఆగండాగండి. అది తాడు. పామనుకుని భ్రమపడ్డాను."

దాంతో భయం పోయిన శ్రోతలంతా యథాస్థానాలకి వచ్చి చేరాక గురువు ఇందాక ప్రశ్న అడిగిన శిష్యుడితో చెప్పాడు.

"ఇందాకటి నీ ప్రశ్నకి జవాబు చెప్తాను విను. నీలో పాము భయం తృటిలో కలిగిందా? లేక మెల్లిమెల్లిగా కలిగిందా? అలాగే ఆ భయం తృటిలో పోయిందా? లేక మెల్లిమెల్లిగానా? ముక్తి కూడా ఇలాగే తృటిలో వస్తుంది."

గురువు ఇచ్చిన వివరణతో అతనికి విషయం అర్థమైంది.

## 62. స్థిరత్వం

త్వరగా పెరిగే ఓ లత, ఓ కొబ్బరి చెట్టు కాండాన్ని అల్లుకుంది. ఆ కొబ్బరి చెట్టుతో గర్వంగా చెప్పిందది.

"చూడు నేను ఎంత త్వరగా పెరిగి నిన్నంతా అల్లుకున్నానో? మరి నువ్వో? ఓ అంగుళం కూడా పెరగలేదు."

కొబ్బరి చెట్టు చిన్నగా నవ్వి జవాబు చెప్పింది.

"వేలకొద్దీ లతలు నాతో ఇదే మాటన్నాయి. గాలి తాకిడికి అవి వెళ్ళిపోయాయి. నేను మాత్రం బలంగా ఇక్కడే ఉన్నాను."

హిందూ సనాతన ధర్మం ఆ కొబ్బరి చెట్టు లాంటిది.

## 63. పనిముట్టు

ధ్యాన సాధనలో పడ్డ ఓ శిష్యుడు వేళకి తినక తన శరీరాన్ని నిర్లక్ష్యం చేయసాగాడు. అది తెలిసి గురువు శిష్యుడితో చెప్పాడు.

"నువ్వు అడవికి వెళ్ళి ఎవరికీ ఉపయోగపడని ఆకునొకదాన్ని తీసుకురా."

ఆ శిష్యుడు ఓ చెట్టు కింద రాలిన ఆకులని ఏరే ఆయుర్వేద వైద్యుడి భార్యని, ఇంధనంగా ఎండుటాకులని ఏరే ముసలావిడని, విస్తరి కుట్టడానికి ఆకులు ఏరే ఆమెని, వంటలోకి వాడటానికి... ఇలా అడవిలోని ప్రతి ఆకునీ ఏరేవాళ్ళని చూసి ఏదీ నిరుపయోగం కాదని తెలుసుకున్నాడు. తిరిగి వస్తూ, ఓ సరస్సులో తేలే ఆకుని తీసుకున్నాడు. కాని, దాని మీద రెండు చీమలుండి తమ ప్రాణాలని కాపాడుకున్నాయి.

శిష్యుడు గురువు దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"స్వామీ. అడవిలోని అన్ని ఆకులూ విలువైనవే. నిరుపయోగమైంది ఒక్కటీ లేదు."

"అడవిలోని ఆకులే విలువైనవయితే, నీ మానవ దేహం ఇంకా ఎంత విలువైందో తెలుసుకో. ఇది మోక్షాన్నిచ్చే పనిముట్టు. దాన్ని నువ్వు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం వుంది."

దాంతో శిష్యుడికి తన తప్పిదం తెలిసివచ్చి ఆ తర్వాత వేళకి ఆహారం తింటూ జాగ్రత్తగా జీవించసాగాడు.